క్లుప్తంగా

కోటేశ్వర ఆలయం సందర్శన


ఆలయంలో శ్రీరామనంద భారతీ స్వామీజీ

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయాన్ని చాతుర్మాస దీక్షలో భాగంగా విశాఖపట్నం భువనేశ్వరి పీఠానికి చెందిన శ్రీరామనంద భారతీ స్వామీజీ, మౌనానంద సందర్శించి, ఆలయంలో పూజలు నిర్వహించుకున్నారు. అదేవిధంగా గ్రహణం విడిచిన సందర్భంగా జిల్లా ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక జడ్జి ఎస్.ఎం.ఫణికుమార్ దంపతులు స్వామివారిని దర్శించుకుని, అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, ఈవో మునగవలస సుకన్య సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీరామశర్మ, పాలకమండలి చైర్మన్ దేవంద్ర నాయుడు, కోరాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని నైరా వ్యవసాయ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు తొలుచు పురుగు నివారణపై తోటల్లో అవగాహన తరగతులను నైరా అధ్యాపక సిబ్బంది సోమవారం ఏర్పాటు చేశారు. కాఫీ తోటల్లో పూత వచ్చిన 150 రోజులు తర్వాత తొలుచు పురుగు పడుతుందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పురుగు సోకిన గింజలను తగలపెట్టి గుంతలో పూడ్చాలన్నారు. బవేరియా బస్సియానా జీవ శిలింద్రంను పిచికారీ చేసి పురుగు వ్యాప్తిని అరికట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో సస్య రక్షణ విభాగం శాస్త్రవేత్తలు పి.సీతారాం, రాజశేఖర్, సంధ్య, సృజన తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక


సమావేశమైన ఏపీ దళిత మహాసభ సభ్యులు

రణస్థలం: ఏపీ దళిత మహాసభ రణస్థలం, లావేరు మండలాల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని ఏపీ దళిత మహాసభ సమావేశం సోమవారం నిర్వహించారు. దీనిలో రణస్థలం మండల అధ్యక్షుడిగా పల్ల నీలయ్య, ప్రధాన కార్యదర్శిగా ముక్కు రాము, గౌరవ అధ్యక్షుడిగా సాకేటి పోతయ్య, ఉపాధ్యక్షులుగా యామల గోపాల్, బోనెల పరుశురాం, సామాధుల రమణ, కార్యదర్శులుగా మామిడి జగదీష్, లండ రామప్పడు, సుధాకర్, కుప్పిలి నవీన్ తదితరులను ఎన్నుకున్నారు. అలాగే లావేరు మండల అధ్యక్షుడిగా నేతల ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా గంట్లాన మారీష్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఉప్పాడ చలపతిరావు, డోకా రామకృష్ణ, బోనెల రవి, కార్యదర్శులుగా దాకి రామారావు, గంధవరపు పైడిరాజు, లుట్ట సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కుప్పిలి శ్రీను, కోశాధికారిగా రాకోటి ఆదినారాయణ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశానికి సీనియర్ దళిత నాయకులు పల్ల అప్పన్న, దుక్క ఆదినారాయణ, దత్తి గోవింద, టి.సూరప్పడు హాజరయ్యారు.

మూడు విడతల్లో యూరియా వాడాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జి.సిగడాం: వరి పంటలో ఎకరాకు 25 కేజీల చొప్పన మూడు విడతల్లో మొత్తం 75 కేజీల వరకు ఎరువును ఉపయోగించాలని మండల వ్యవసాయశాఖ అధికారి బెండి బాబ్జీ సూచించారు. మండలంలోని జగన్నాథవలస, జి.సిగడాం, వెంకయ్యపేట గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి జీవన్‌చంద్రన్ అధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి తులసీప్రసాద్‌సాహు, అగ్రికల్చర్ అసిస్టెంట్ తిర్లంగి మాధవి, ఎం.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం రూరల్: సైన్స్ ప్రాజెక్టు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

పడకేసిన పారిశుద్ధ్యం


తాళ్లవలస గ్రామంలోని కాలువల్లో పేరుకుపోయిన మురుగు నిల్వలు

- కాలువల్లో పేరుకుపోయిన చెత్త
- మురుగు నీటి నిల్వతో దుర్వాసన
- ప్రజలకు తప్పని దోమల బెడద

ఎచ్చెర్ల: కూటమి పాలనలో ఎచ్చెర్ల నియోజకవర్గంలో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడికక్కడ కాలువల్లో చెత్త పేరుకుపోయి.. మురుగు నీరు నిల్వ అవ్వడంతో దుర్వాసన వెదజల్లుతోంది. సాధారంగానే వర్షాకాలంలో నాలుగు నెలల పాటు దోమలు విపరీతంగా వృద్ధి చెందుతాయి. వీటికి తోడు కాలువల్లో పేరుకుపోయిన మురికి నిల్వాలు వలన నివాసాల్లో మరింత దోమల బెడద పెరిగింది.


చిలకపాలేంలోని కాలువలో...

కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో ప్రతిరోజూ ఇళ్ల నుంచి వస్తున్న వ్యర్థాలతో డ్రైనేజీలు నిండిపోతున్నాయి. మరోవైపు పారిశుద్ధ్య కార్మికులు రోడ్లను శుభ్రం చేస్తూ వచ్చే చెత్తను కాలువల్లోకి తోసేస్తుండడంతో మరింత అధ్వానంగా మారింది. జాతీయ రహదారికి ఆనుకుని గ్రామాల్లో వాడుక నీరు బయటకు వెళ్లేందుకు వీలులేక రోడ్లుపైనే మురికినీరు దర్శనమిస్తోంది. చిలకపాలేం, ఎచ్చెర్ల, కుశాలపురం, నవభారత్ వంటి చోట్ల రోడ్లు మీదకే వాడుక నీరు వచ్చి మురికినిల్వాలు పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మొక్కుబడిగా పూడికల తొలగింపు


బింగుపేట కాలువలో దుస్థితి

గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులతో మొక్కుబడిగా ప్రధాన కాలువల్లో పూడికలు తొలగిస్తున్నారు. వీధుల మధ్య ఉన్న కాలువల్లో మురికి నిల్వాలు పెరిగిపోయి దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు ప్రతీ గ్రామంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయాల్సి ఉన్నా.. ఎక్కడా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. కనీసం గ్రామాల్లో బ్లీచింగ్ జల్లడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎంఎల్ అయిల్ బాల్స్ కాలువల్లో విడిచిపెట్టడం, నీటి నిల్వాల్లో గాంబూషియా చేపలు విడిచిపెట్టడం వంటి పనులు చేపట్టడం లేదు. దీంతో దోమలు వ్యాప్తి పెరిగిపోయింది. ఫలితంగా ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పూడికలు తీయడం లేదు

ఇంట్లో దోమల బారినపడకుండా అనేక చర్యలు తీసుకుంటున్నాం. అయినా ఫలితం ఉండడం లేదు. ఎప్పటికప్పుడు కాలువల్లో పూడికలు తీయడం లేదు. వాడుక నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. కాలువల్లో పూడికలు తీయించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

– రెడ్డి గోపాల్, చిన్నయ్యపేట, లావేరు మండలం

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లోని కాలువల్లో పూర్తిస్థాయిలో పూడికలు తీయమని అధికారులకు చెప్పడం జరుగుతుంది. యాంటీ లార్వా మందులు ఇవ్వడం జరుగుతోంది. పూర్తిస్థాయిలో కాలువల్లో మురికి నిల్వాలు తొలగించడానికి అధికారులకు సూచనలు చేసి చర్యలు చేపడతాం.

– పి.వెంకట్రాజు, ఎంపీడీవో, లావేరు మండలం

అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ


రణస్థలం: అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ రాజు తదితరులు

రణస్థలం: రైతులకు యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమవ్వడంతో అన్నదాతకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరుబాట పట్టిందని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ రాజు, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్‌ను సోమవారం అవిష్కరించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

జి.సిగడాం: రాష్ట్రంలో యూరియా కొరతపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రణస్థలం తహసీల్దార్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డోల వెంకటరమణ సోమవారం పిలుపునిచ్చారు. మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరవ్వాలని కోరారు.

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం పరిధిలోని పొన్నాడ బ్రిడ్జి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి శ్రీకాకుళం ఆర్డీవోకు వినతిపత్రం అందజేయనున్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఫిజియోథెరపీ దినోత్సవ వేడుకలు




శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపీ విద్యార్థులు పోస్టర్, పోడియం ప్రెజెంటేషన్ పోటీల్లో పాల్గొని బహుమతులను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు సౌజన్య, బరాటం సంతోష్‌కుమార్, ప్రిన్సిపాల్ రాహుల్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం రూరల్

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

గార: మండలంలోని శ్రీకూర్మంలో ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు అర్చకుడు పెంట అశోక్ శర్మ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ శ్రీకూర్మనాథస్వామి ఆలయ సమీపంలోని బాలాజీ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఉత్సవాల్లో దశావతారాల్లో అమ్మవారు దర్శనమిస్తారని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా ఈనెల 25వ తేదీన చక్రార్చన పూజలు, 28న అన్నదానం చేపడతామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ


ఎచ్చెర్ల: నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది


శ్రీకాకుళం రూరల్: నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నేత్రదానంపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జాతీయ అంధత్వ, దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా జెమ్స్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ హేమంత్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మరణాంతరం నేత్రదానం చేయడం అనేది సాంప్రదాయంగా చేయాలని ఆకాంక్షించారు. జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రామ్ మేనేజర్ ఎస్.పుష్పలత మాట్లాడుతూ నేత్రదానంపై విద్యార్థులంతా అవగాహన కలిగి, వారి ప్రాంతాల్లో ఎవరైనా మరణిస్తే నేత్రదానం చేసేందుకు ముందుకు వచ్చేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఆపరేటింగ్ అధికారి శ్రీనాథ్‌రెడ్డి, జనరల్ మేనేజర్ డాక్టర్ డి.ప్రవీణ్, డీజీఎం ఎస్.విజయభాస్కరరావు, ఆప్తాలమిక్ అధికారులు ఎంఆర్‌కే దాస్, డి.రాజశేఖరరెడ్డి, బి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: స్థానిక బీఆర్ఏయూలో నేత్రదానంపై సోమవారం అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సును వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య ప్రారంభించి మాట్లాడారు. నేత్రదానం వలన మరో వ్యక్తికి చూపును ప్రసాదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.అనురాధ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా.డి.వనజ, పీవోలు డి.తాతారావు, టి.భవానీ తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వర కాలేజీలోనూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేతవీ నాగోజీ, కళాశాల పరిపాలన అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జి బి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

11న హుండీ లెక్కింపు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పీఎన్ కాలనీలో ఉన్న నారాయణ తిరుమల ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం ఈనెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆరోజు ఉదయం 9 గంటల నుంచి ఆలయ ప్రధాన అర్చకులు, నగర పెద్దలు, ఇతర శాఖ అధికారులు, భక్తులు, దేవాదాయ, ధర్మదాయ శాఖ పర్యవేక్షణలో హుండీ తెరుచుటకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో 20 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు

రణస్థలం: మండలంలోని వరిసాం జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని సోమవారం తెల్లవారుజామున 20 గొర్రెలు మృతి చెందగా, మరో 10 గొర్రెలు తీవ్రంగా గాయపడినట్లు బాధితుడు పిట్ట రమణ జేఆర్‌పురం పోలీసులకు ఫిర్యాదుల చేశాడు. జేఆర్‌పురం పంచాయతీ గొల్లపేట గ్రామానికి చెందిన రమణ గొర్రెలను మేతకు తీసుకెళ్లి, రోడ్డు దాటిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పశువైద్యాధికారి పూర్ణిమ ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే ఘటనా స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పరిశీలించి పాడిరైతును ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయనతో పాటు ఎచ్చెర్ల నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ముద్దాడ రాజశేఖర్, ఎచ్చెర్ల చేతి వృత్తుల విభాగం అధ్యక్షుడు టేకు బ్రహ్మాజీ, ఉప సర్పంచ్ దన్నాన సీతారాం తదితరులు ఉన్నారు.

చదువుతోనే అభివృద్ధి సాధ్యం


శ్రీకాకుళం: విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం: చదువుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని హర్షవల్లి లయన్స్ క్లబ్, లయన్స్ ఇంటర్నేషనల్ డీసీ కరణం హారికా ప్రసాద్, ప్రెసిడెంట్ సత్య స్వరూప అన్నారు. సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వాలు విద్యాభివృద్ధి కోసం నిధులను అత్యధికంగా వెచ్చిస్తున్నాయని తెలిపారు. బడి బయట పిల్లలను బడిలో చేర్పించే ప్రక్రియలో గతంలో హర్షవల్లి లయన్స్ క్లబ్ విశేషంగా కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ మంగమ్మ, కరణం శోభారాణి, జగన్నాథం నాయుడు, పాలిశెట్టి మధుబాబు, చందక నిహార్, కరణం హారిక, పార్వతీశ్వరరావు, మజ్జి సుమన్, లక్ష్మణ్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: సంపూర్ణ అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండల పరిధిలోని సింగుపురం జెడ్పీహెచ్ స్కూల్లో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడిలోనే ఉంచాలన్నారు. విద్యతోనే హక్కులను కాపాడుకోగలమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: అక్షరాస్యత పెరిగినప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వావిలపల్లి జగన్నాథంనాయుడు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడిలోకి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ కో–ఆర్డినేటర్ ఎస్.జోగినాయుడు, స్టార్ వాకర్స్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరాప్రసాద్, సుగంధం సంజీవరావు, గేదెల లక్ష్మీ, ఐ.శంకర్ తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీ ప్రాక్టీసులో బాలికలు

సై..!

- స్కూల్‌గేమ్స్ పోరుకు రంగం సిద్ధం
- నేటి నుంచి ఎంపిక పోటీలు
- మొత్తం ఐదు దశల్లో జరగనున్న పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల క్రీడల (స్కూల్‌గేమ్స్)కు రంగం సిద్ధమైంది. 2025–26 విద్యా సంవత్సరానికిగాను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ పరిధిలోని పాఠశాల క్రీడల సమాఖ్య (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో మంగళవారం నుంచి జరగనున్న స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. విద్యార్థి జీవితంతో స్కూల్ గేమ్స్ క్రీడా పోటలు అతి ముఖ్యమైనవి. ఓ క్రీడాకారుడు తయారయ్యేది, గుర్తింపబడేది స్కూల్ గేమ్స్ తోనే. అలాంటి స్కూల్‌గేమ్స్ పోటీలను ప్రభుత్వం తాత్సారం చూస్తున్నా.. అధికారులు, వ్యాయామోపాధ్యాయులు మాత్రం తమ చేతిచమురుని వదిలించుకుని ఈ క్రీడలను ముందుండి నడిపిస్తున్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధికారులు ఇన్‌చార్జి డీఈవో ఎ.రవిబాబు, బీవీ రమణ, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, పి.తవిటయ్య తదితరులు ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్నారు. మరో పక్క బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వర్షాలు పడుతుండడంతో పోటీలపై ఆందోళన నెలకొంది.

32 క్రీడాంశాలు

స్కూల్ గేమ్స్ పోటీలు మొత్తం 5 స్థాయిల్లో.. 32 క్రీడాంశాల్లో నిర్వహించనున్నారు. జిల్లా పరిధిలో మండల స్థాయి, డివిజన్ స్థాయి, జిల్లాస్థాయి పోటీలు జరగనున్నాయి. అనంతరం రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తారు. క్రీడాకారులు తమ ప్రతిభను కనబరుస్తూ, వివిధ స్థాయిలను దాటుకొని ఎంపిక కావాల్సి ఉంటుంది.

ఇదీ షెడ్యూల్...

తొలి దశగా మొదలయ్యే మండల స్థాయి పోటీలను ఈనెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తారు. అలాగే డివిజన్ స్థాయి పోటీలు ఈనెల 15వ తేదీ నుంచి 17వ తేదీల మధ్యన నిర్వహించాలని నిర్ణయించారు. అదేవిధంగా జిల్లాస్థాయి పోటీలను ఈనెల 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని ఏర్పాట్లు చేస్తున్నారు. మండల, నియోజకవర్గ స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, యోగా, చెస్ ఈ ఏడు క్రీడాంశాల్లో మాత్రమే ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. జిల్లాస్థాయికి ఈ ఏడు క్రీడాంశాల క్రీడాకారులతోపాటు మిగిలిన 25 క్రీడాంశాల బాలబాలికలు సైతం నేరుగా ప్రాతినిధ్యం వహిస్తారు.


వాలీబాల్ సన్నద్ధ మ్యాచ్‌లో యువ క్రీడాకారుల జోరు

అర్హులు ఎవరంటే..?

- స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు అండర్–14, 17, 19 వయో విభాగాల్లో బాలబాలికలకు వేర్వేగా జరుగుతాయి.
- పాఠశాల విద్య పరిధిలో అండర్–14, 17 విభాగాల్లో, ఇంటర్మీడియట్ విద్య పరిధిలో అండర్–19 విభాగాల్లో ఎంపికలు జరుగుతాయి.
- అండర్–14 విభాగంలో బాలబాలికలు 2012 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలి.
- అండర్–17 బాలబాలికలు 2009 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలి.
- అండర్–19 బాలబాలికలు 2007 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలి.
- అండర్–14కు 9వ తరగతిలోపు చదువుతూ ఉండాలి. అండర్–17కు ఇంటర్ మొదటి ఏడాదిలోపు చదువుతూ ఉండాలి. అండర్–19కు డిగ్రీ ఫస్టియర్ లోపు చదువుతూ ఉండాలి.


ఖోఖో సాధనలో బాలురు


సాఫ్ట్‌బాల్ శిక్షణలో నిమగ్నమైన క్రీడాకారులు

పారదర్శకంగా ఎంపికలు

విద్యార్థి జీవితంలో కీలకమైన స్కూల్‌గేమ్స్ పోటీలను అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. వారు శిక్షణ పొందుతున్న క్రీడలో తమ ప్రతిభను నిరూపించుకోవాలి. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులకు అన్ని వసతులు, భోజనాలు కల్పించేలా ఎంఈవోలు, హెచ్ఎంలు చొరవ తీసుకోవాలి. పారదర్శకంగా ఎంపికలను పూర్తి చేయాలి.

– ఎ.రవిబాబు, ఇన్‌చార్జి డీఈఓ, శ్రీకాకుళం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు

పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నాం

జిల్లాలో స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నాం. డీఈవో నేతృత్వంలో పీఈటీ సంఘ నాయకులు, ఎంఎస్‌వోలు, నియోజకవర్గ స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ల సమన్వయంతో పోటీల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. తొలుత జిల్లాలో అత్యంత ఆదరణ కలిగిన ఏడు క్రీడాంశాల్లో మండల స్థాయి, డివిజన్ స్థాయిల్లో ఎంపికలను నిర్వహిస్తున్నాం. ఆ తర్వాత జిల్లాస్థాయి పోటీలు జరుగుతాయి. గుర్తింపు కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తో విద్యార్థులు హాజరవ్వాల్సి ఉంటుంది.

– బడి వెంకట రమణ, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి, శ్రీకాకుళం జిల్లా